కర్నూలు | నంద్యాల
వార్త
17 జూన్, 2024 సోమవారం పేజీలు 4

# మందగించిన రుతుపవనాల గమనం..!



నంద్యాల విద్య, జూన్ 16, ప్రభాతవార్తః

ఏపీ నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలించడం లేదని వాతావరణ శాస్త్రజ్ఞనులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు ఇంకా తాకనే లేదు. ఈఏడాది నైరుతి రుతుపవనాలు అంచనా కంటే మూడు రోజులు ముందుగానే ఏపీలోకి ప్రవేశించాయి. రాష్ట్రానికి ఈనెల 2న రుతుపవనాలు వచ్చినప్పటికి ఇంకా విస్తరించలేదు. ఉత్త రాంధ్రను నైరుతి మేఘాలు విస్తరించలేదు. రానున్న రెండు మూడు రోజుల్లో రాయలసీమ నుంచి మధ్య బంగాళఖాతం వరకు ద్రోణి కొనసాగుతుందని దీని ప్రభావంతో మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుందన్నారు. రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, వైయస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్షాలు పడితే రైతులు పొలాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని ఖరీఫ్ పంట దిగుబడి సాధించాలంటే వర్షాలు సకాలంలో కరుస్తేనే పంటల దిగుబడి సాధించేందుకు అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

# శ్రీమఠానికి పోటెత్తిన.. భక్తులు..!

- అన్ని కౌంటర్లు భక్తులతో కిటకిట
- భక్తులను ఆశీర్వదించిన పీఠాధిపతి



**మంత్రాలయం, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవురోజు కావడంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఏపినుండే కాక పక్కనున్న తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ,కేరళ తదితర రాష్ట్రాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో శ్రీమఠం ప్రాకారం, పరిమళ ప్రాసాద కౌంటర్లు, అన్నపూర్ణ భోజనశాల, తుంగభద్ర నదీతీరం తదితర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనానికి తరలివచ్చిన భక్తులను పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండితకేసరి రాజా ఎస్ గిరియాచార్. ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కె శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, పిఆర్ఓ వ్యాసరాజాచారి. ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.




# త్రాగునీటి వసతి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించండి..

- నంద్యాల అభివృద్ధికి సలహాలివ్వండి
- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించి త్రాగునీటి వసతి కల్పించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. ఆదివారం పట్టణ శివారు ప్రాంతంలోని ప్రజల తాగునీటి అవసరాల కోసం అదనపు ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం కోసం గుర్తించిన 150 ఎకరాల స్థలాన్ని అమృత్ పథక పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.**

**నంద్యాల, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధిః** రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం జిల్లా కేంద్రం అయినప్పటి నుండి పట్టణ జనాభా తీవ్రంగా పెరిగిపోయిందని ఆమేరకు తాగునీటి సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ ట్యాంకుకు సమీపంలో వున్న 150 ఎకరాల్లో మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదేశించారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తుతం వున్న ఎస్ఎస్ ట్యాంకు నిర్మించామని, మూల సాగరం, ఎన్‌జిఓ కాలనీ, రామాలయం తదతర ప్రాంతాల్లో నీటి ట్యాంకులు నిర్మించడం వల్లనే ఆ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చేయగలిగామన్నారు. పట్టణంలో అధికంగా కాలనీలు పెరిగిపోవడం వల్ల ప్రజలకు భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఇప్పటి నుంచే శ్రద్ధ తీసుకోవాలని నూతన ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తిచేయాలని మంత్రి అదేశించారు. నంద్యాల జిల్లా అభివృద్ధి మేధావులు, వ్యాపారవేత్తలు సంఘ సంస్కర్తలు సూచనలు, సలహాలు ఇవ్వాలని మంత్రి ఈసందర్భంగా కోరారు. ఈకార్యక్రమంలో మంత్రి ఫరూక్‌తో పాటు మున్సిపల్ కమిషనరు, ఎంఈ మూర్తి, శ్రీనివాసరెడ్డిలతో పాటు 12వ వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.





# మనోవాంఛల త్యాగమే..బక్రీద్..!

- బక్రీద్‌తోనే హజ్ యాత్రకు ముస్లింల శ్రీకారం..
- మసీదులు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు..
- అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు..
- నేడు బక్రీద్(ఈదుల్-అజ్-హా)..



**"దైవారాధన విశిష్టతను ప్రచారం చేసే నిమిత్తం ఒక మహనీయుడు చేసిన నిరుపమాన త్యాగశీలతకు ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు జరుపుకుంటారు..బక్రీదును ఈదుజ్జహాగా కూడా పిలుస్తారు.. ప్రతి ముస్లీం పంచసూత్రాలను తప్పకుండా ఆచరించాలి.. అల్లాహ్‌పై విశ్వాసంతో ముస్లింలు ప్రతి రోజు ఐదు సార్లు నమాజ్ చేస్తారు"..**

**కోసిగి, జూన్ 16, ప్రభాతవార్త :** "ఇది నాలుగు వేల సంవత్సరాల కిందట జరిగిన సంఘటన..ఒక యుగపురుషుడు మహాత్యాగం చేసాడు..తొలుత కన్నదేశాన్ని త్యాగం చేసాడు..ఈ తరువాత భార్యబిడ్డలను త్యాగం చేసాడు.. ఇంకా అని న్నింటి కంటే మిన న్నగా.. ప్రాణపదంగా పెంచుకున్న తన ఏకైక కుమారుడ్ని కూడా త్యాగం చేసాడు.. అన్ని దైవపరీక్షల్లో విజయం సాధించాడు.. ఆయన త్యాగంలో దైవభీతి ఉంది.. ఆయన త్యాగంలో దైవ విధేయత ఉంది.. ఆయన త్యాగంలో కర్తవ్య నిర్వహణ ఉంది.. ఆయన త్యాగంలో దీక్ష ఉంది..ఆయన త్యాగంలో చిత్తశుద్ధి ఉంది.. ఆయన త్యాగంలో నాటి నుంచి నేటికీ ఆదర్శం ఉంది.. ఆయన త్యాగ ఫలితమే నేడు ప్రపంచ ముస్లింలు చేసుకునే బక్రీద్ అదే ఈదుల్ అజ్‌హా పండుగ".. రంజాన్ తరువాత రెండు నెలలకు ఈదుల్ అజ్‌హా(బక్రీద్) వస్తుంది. ఈదుల్‌జుహా మనిషి యొక్క త్యాగ నిరతిని గురించి తెలియజేసే పండుగ. అందుకే దీనిని 'త్యాగాల పండుగ' అని అంటారు. దీనికే మరో పేరు 'బక్రీద్'. ఈ పండుగను ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 12వ నెల అయిన 'జిల్‌హాజ్జ'లోని పదో తేదిన జరుపుకుంటారు. బక్రీద్ అంటే 'బకరా, ఈద్', బకరా అంటే 'జంతువు', లేక గొర్రె అని, ఈద్ అంటే పండుగ. ఈ క్రమంలో జంతువు(గొర్రె)నుబలి ఇచ్చే పండుగ కనుక ఈ పండుగను 'ఈదుల్-ఖుర్బానీ' అంటారు. ఖుర్బానీ అంటే దేవుని పేరుతో పేద వారికి జంతువు మాంసం దానం ఇవ్వటం..

**చరిత్రను పరిశీలిస్తే..**

అల్లాహ్ ముఖ్య ప్రవక్త అయినటువంటి హజ్రత్ ఇబ్రహీం ఇరాన్‌కు చెందిన వాడు. ఇతడు ఇస్లాం విశ్వాసాలను ప్రపంచమంతా ప్రచారం చేస్తూ కాలి నడకన తిరుగుతూ ఉండేవాడు. ఇబ్రహీంకు వివాహం అయినప్పటికి చాలా ఏళ్లవరకు సంతానం కలుగలేదు. సంతానం కోసం ఇబ్రహీం మరో వివాహం చేసుకుంటాడు. అయినా వీరికి సంతానం కలుగలేదు. ఒక రోజు ప్రార్థన ద్వారా అల్లాహ్‌తో మాట్లాడుతూ సంతానాన్ని కలిగించమని కోరుతాడు. అల్లాహ్ ప్రవక్తకోరికను మన్నించి

• వివరాలు 2లో

# పోలవరంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి : మాండ్ర



**నందికొట్కూరుటౌన్, జూన్ 16, ప్రభాతవార్త ః** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టుపై దృష్టి సారించారని, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించవచ్చని, దీంతో ఈ ప్రాంత రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించవచ్చని నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మాండ్ర శివానందరెడ్డితో పాటు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాండ్ర మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో రైతాంగానికి పెద్దపీట వేసి వారిని అన్నివిధాలా అదుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ప్రోత్సహకాలు లేవన్నారు. తెదేపా హయాంలో డ్రిప్ పరికరాలతో పాటు రైతులకు ట్రాక్టర్లు, మోటర్లు, పైపులు, స్ప్రేయర్లు కొనుగోలు చేసేందుకు సబ్సిడీలు ఇస్తామన్నారు. రైతుకుటుంబం నుంచి వచ్చిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అసెంబ్లీలో రైతుగళం విన్పిస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ కెసి కాలువకు నీరు రావాలంటే సుంకేసుల రిజర్వాయర్ మీద అధారపడి ఎప్పుడు నీరు వస్తుందో, ఎపుడు నీరు రాదో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. వైకాపా హయాంలో కెసి రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం నీరు వస్తుంది పంట వేసుకోండని ఐదేళ్లలో వైసీపీ నాయకులు కానీ, అధికారులు గానీ రైతాంగానికి హామీ ఇవ్వలేకపోయారన్నారు. నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి సీఎం చంద్రబాబుతో పట్టుబట్టి మల్యాల, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయించారని, 800 అడుగులు దాటితే మోటర్లు అన్ చేసుకోవచ్చున్నారు. మన రైతాంగం బాగుంటేనే మన ప్రాంతం బాగుంటుందని మాండ్ర శివానందరెడ్డి రైతాంగం కోసం ఎంతో కృషి చేశారన్నారు. మినుములు, కంది విత్తనాలే గాక, ఈ ప్రాంతంలో ఎక్కువగా రైతాంగం మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తారని, ఈ విత్తనాలు కూడా సబ్సిడీపై పంపిణీ చేసేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు సబ్సిడీ విత్తనాల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చాలాచోట్ల వ్యవసాయశాఖ, హార్టికల్చర్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండడం లేదని తమ దృష్టికి వచ్చిందని, తెదేపా హయాంలో ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అల్లూరు గ్రామంలో పెద్దబావి నీటి సమస్య ఉందని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, తిప్పారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన పోలీసులకు ప్రశంస పత్రాలు



**నంద్యాల క్రైం, జూన్ 16, ప్రభాతవార్తః** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగిందని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈనేపథ్యంలో పోలీసులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు జిల్లా ఎస్పీ అందజేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. జిల్లా పోలీస్‌శాఖ సమిష్టి కృషిగా నిబద్ధతతో విధులునిర్వహించడం వల్లనే, నామినేషన్ సమయంలో, ఎన్నికల కౌంటింగ్ సదర్భంగ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతవాతావరణంలో నిర్వహించగలిగామన్నారు. పోలింగ్ రోజు ఎస్పీ సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించడం వల్ల ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా నిరోధించగలిగామని అధికారులు ఈసందర్భంగా తెలిపారు. శాంతిభద్రత పరిరక్షణలో పోలీసులు ప్రత్యేక పాత్ర పోషించారని కొనియాడారు. ముందస్తుగా తీసుకున్న చర్యలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ఎన్నికల ప్రక్రియ అద్యంతం అంకితభావంతో నిరంతర శ్రమతో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఎస్‌బి డిఎస్పీ సంతోష్, ఎస్డీపిఓ వై శ్రీనివాసరెడ్డి, ఏ శ్రీనివాసరావు, షర్ఫుద్దిన్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# మంత్రి బిసిని కలిసిన అధికారులు

**నంద్యాల, జూన్ 16, ప్రభశాతవార్త ప్రతినిధి**

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డిని నంద్యాల జిల్లా కలెక్టరు డాక్టరు కె.శ్రీనివాసులు, యస్‌పిసి రఘువీరారెడ్డి, జేసి రాహుల్‌కుమారరెడ్డి మర్యాద పూర్వకముగా కలిసిశారు. అదివారము ఉదయం 10.30నిమిషాలకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డిని కలెక్టరు, యస్‌పి, జేసిలు కలిసి పుష్పగుచ్ఛము అందించారు. ఈసందరముగా వారితో మంత్రి ఏకాంతముగా గంట పాటు వివిద అంశాల గురించి చర్చించారు. ముఖ్యంగా జిల్లాలోని రోడ్డు, భవనాల గురించి అలాగే బనగానపల్లె నియోజక వర్గంలో జరుగుతున్నపెండింగులో ఉన్న పలు అబివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించినట్లు సమాచారము.



# బక్రీద్ శుభాకాంక్షలు

**: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార పరిశుద్ధి శాఖా మంత్రి టి.జి. భరత్**

**: కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన**



**కర్నూలు, జూన్ 16, ప్రభాతవార్త :** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఉన్న ముస్లిం సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార పరిశుద్ధి శాఖా మంత్రి టి. జి. భరత్ మరియు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే పండగ బక్రీద్ అని, ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ దాన గుణానికి, త్యాగానికి ప్రతీక అని వారు తెలిపారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

**మంత్రిని కలిసిన కలెక్టర్ :** కర్నూలు సంకల్ బాగ్ లోని మంత్రి నివాసంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టి.జి. భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జిల్లా కలెక్టర్ డా జి.సృజన, అనంతరం ఇరువురు జిల్లా అభివృద్ధి విషయాల పై చర్చించుకున్నారు.






# మనోవాంఛల త్యాగమే.. బక్రీద్..!

(మొదటి పేజీ తరువాయి ) :
పండంటి మగ బిడ్డను ప్రసాదిస్తాడు. అతడి పేరు 'ఇస్మాయిల్. హజ్రత్ ఇబ్రహీంకు ఇస్మాయిల్ అంటే ఎనలేని ప్రేమాభిమానాలు.. ఒకరోజు ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లాహ్ కనిపించి "నీ కుమారుడిని నాకు బలి ఇవ్వ"మని కోరాడు. నిద్ర నుంచి మేలుకున్న ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌కు ఈ సంగతి తెలియజేశాడు. సహజంగా దైవభక్తుడైన ఇస్మాయిల్ అందుకు 'సరే' అన్నాడు. దీంతో ఇస్మాయిల్‌ను తీసుకుని వెళ్లి దేవునికి బలి ఇచ్చే విషయంలో ఇబ్రహీం తన కత్తితో ఇస్మాయిల్ మెడను రెండు సార్లు కోస్తాడు. కానీ, మెడ తెగదు. అప్పుడు ఇస్మాయిల్ తండ్రితో...నాన్నగారు మీరు నాపై ప్రేమతో మెడను కోయలేక పోతున్నారు. నీ కళ్లకు బట్ట కట్టుకుని కోయమని చెబుతాడు. మూడో సారి కళ్లకు బట్ట కట్టుకుని ఇబ్రహీం, ఇస్మాయిల్ మెడను కోసిన ప్పటికి అది తెగదు. అప్పుడు అల్లాహ్ దైవవాణి ద్వారా ఇబ్రహీం 'ఇది నిన్ను పరీక్షించడానికి మాత్రమే'. 'నా పరీక్షలో నీవు నెగ్గినావు. ఇప్పుడు నీవు ఒక బకరాను 'ఖుర్బానీ'గా ఇవ్వు' అని చెప్పి ఒక గొర్రెను సృష్టించాడు. ఆనాడు ఇబ్రహీం దేవునికి గొర్రెను సమర్పించినందుకు ఆనాటి నుంచి జంతువును 'ఖుర్బానీ' ఇవ్వడం ఇస్లాం సాంప్రదాయంలో ఆనవాయితీగా మారింది. అదే బక్రీద్..

**ఖుర్బానీ విశిష్టత:** బక్రీద్ పశుబలి కోసమే నిర్ధేశితమైందని భావించడం పొరపాటు.. మానవాళిలో ఆవరించి ఉన్న పశుత్వాన్ని అరికట్టి నిష్కళంకమైన హృదయులుగా ఉండడమనేది దైవానికి ప్రీతికరమని బక్రీద్ అంతర్భోధం.. బక్రీద్ పండుగ రోజునమాజ్ పూర్తయిన తరువాత పొట్టేలును బలి ఇస్తారు.. దీన్నే ఖుర్బానీ అంటారు.. ఖుర్బానీ ఇచ్చిన పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు.. ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు దానం చేస్తారు..మూడో భాగాన్ని ఇంట్లోనే వండి స్నేహితులకు, ఆత్మీయులకు విందు ఏర్పాటు చేస్తారు..

**ముస్లీంల తీర్థయాత్ర హజ్...**
బక్రీదు నెల ప్రారంభం నుంచే హజ్ యాత్ర ప్రారంభమవుతుందని ముస్లీంల మత గురువులు ఇమామ్‌లు తెలుపుతున్నారు. ఈ నెలలో హజ్ యాత్ర చేస్తే పుణ్యం వస్తుందని ముస్లీంలు నమ్ముతారు. బక్రీదు పండుగ రోజున ముస్లీంల పవిత్ర స్థలమైన మక్కాలో హజ్ యాత్ర లక్షలాది మందితో జరుగుతుంది. హజ్ అంటే అరబ్బీ భాషలో 'యాత్ర' అని అర్థం. అక్కడ పవిత్రంగా ఉన్న 'కాబా' గృహాన్ని దర్శించే సంకల్పంతో ఈ హజ్ యాత్రను చేస్తారు. నాడు ఇస్లామియా బోధనలను వ్యాపింప చేసేందుకే మక్కాలో 'కాబా' పేరుతో నిర్మించిన ఇస్లామియా ఉద్యమ కేంద్రంసందర్శనే హజ్ లక్ష్యం. దైవ ఆరాధన చేసేందుకు, ఇస్లాం సందేశాన్ని తమ దేశాలకు తీసుకుపోయేందుకు ఏర్పాటు సమావేశానికి 'హజ్'అని పేరు పెట్టారు. ఈ మసీదు కాబా గృహం చుట్టూ ఉంది. అందుకే ప్రపంచంలోని ముస్లీంలు అందరు కాబా వైపు తిరిగి నమాజు చేస్తారు. దీనినే 'ఖిబ్లా' అంటారు.

**బక్రీద్ రోజున ముస్లీంల ప్రత్యేకత:**
బక్రీద్ పండుగకు ముందు రోజున తమ కుటుంబంలో చనిపోయిన వారి సమాదుల దగ్గరకు వెళ్లి అక్కడ వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాల వస్తువులను సమాదులపై ఉంచుతారు. వారు స్వర్గం నుంచి వచ్చి వాటిని భుజిస్తారని, స్వీకరిస్తారని, స్వీకరించి తమను ఆశీర్వాదిస్తారని ముస్లీంలు నమ్ముతారు. ఈ పండుగ రోజున నెమరు వేసే జంతువులను (ఒంటే,మేక, గొర్రె,ఎద్దు) మాత్రమే ఖుర్బానీ(బలి) ఇస్తారు. ముస్లీంల మనోవాంఛల త్యాగానికి ప్రతీకగాఈ బక్రీద్‌ను జరుపుకుంటారు. ఆ తరువాత ముస్లీం సోదరులందరు కలసి 'ఈద్‌గా' అనే ప్రత్యేక ప్రార్థన స్థలంలో ప్రార్థనలు జరుపుతారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు జరుపుకుంటారు. పవిత్రమైన మక్కా యాత్ర(హజ్)చేస్తే జీవితంలో చేసిన పాపాలన్నీ తొలగి పోతాయని నమ్మకం.. బక్రీద్ రోజున ప్రపంచంలోని ముస్లీములంతా ఒకేసారి ప్రార్థనలు నిర్వహిస్తారు.. అందుకే ఈ పండుగను అతి పవిత్రంగా జరుపుకుంటారు..ముస్లీం సోదరులందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు..

## పోలీసులు బందోబస్తులో అప్రమత్తంగా ఉండాలి ; డీయస్పీ శివనారాయణస్వామి



**ఆదోనిటౌన్, జూన్16, ప్రభాతవార్త;** బక్రీద్ పండగ సందర్భంగా ఆదోని పట్టణంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీయస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘర్షణలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులకు డీయస్పీ పలు సూచనలు తెలియజేశారు బక్రీద్ పండగ రోజున ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండగను నిర్వహించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు గోపీ, తేజమూర్తి, నిరంజన్‌రెడ్డి, మంజునాథ్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మంత్రి టీజీ భరత్‌కు తరగని అభిమానం



**కర్నూలు హాస్పిటల్, జూన్ 16, ప్రభాతవార్తః**
కర్నూలు సిటిలో బాపూజీనగర్ 12వ వార్డులో మంత్రి టీజీ భరత్ విజయ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం సాధికార కమిటీ కన్వీనర్ తారనాథ్ అద్వర్యంలో ఈ అన్నదానం జరిగింది. ఈఅన్నదాన కార్యక్రమంలో అబ్బాస్ పాల్గొని వారంతా టీజీ భరత్ పదవి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం ఆహారభద్రత మంత్రిగా సాధించినందుకు ఆదివారం బాపూజీనగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తారానాద్ మాట్లాడుతూ టీజీ భరత్‌కు 12వ వార్డు ప్రజలు సహకరించి ఓట్లు వేసి గెలిపించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా టీజీ భరత్ మంత్రికావడం సంతోషకరమని కర్నూలు అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని మనకు మంచిరోజులు వచ్చాయని ఈసందర ్భంగా తెలిపారు. జీతేంద్ర, రవి, శ్రీను అబ్బాస్‌లు పాల్గొన్నారు.

## వాసవీక్లబ్ అధ్వర్యంలో గొడుగులు, పుస్తకాలు పంపిణి



**బేతంచెర్ల, జూన్ 16, ప్రభాతవార్తః**
బేతంచెర్ల వాసవీక్లబ్ అధ్వర్యంలో వీధి వ్యాపారులకు గొడుగులు, పేద విద్యార్థులకు పుస్తకాలను ఆదివారం పంపిణి జరిగింది. క్లబ్ అధ్వర్యంలో డ్యాన్ టు డేస్క్‌లోని సప్తసేవా కార్యక్రమాల్లో భాగంగా వీధి వా ్యపారులకు వర్షాకాలానికి ఉపయోగపడేవిధంగా గొడుగులు, పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణి చేయడం జరిగిందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. పేదల కోసం క్లబ్ అధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో వాసవీక్లబ్ ఐఈసి ఆఫీసర్ దంతు సుబ్రమణ్యం, గవర్నర్ జయంతి వెంకటేశ్వర్లు, అర్యవైశ్యసంఘం అధ్యక్షులు కె మోహన్‌రావు, రీజినల్ చైర్మన్ ధనుంజయ, అధ్యక్షులు గుంతా వెంకటసుబ్బయ్య, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మధు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



**ఆదోనిలీగల్, జూన్16, ప్రభాతవార్త;** ఉద్యోగ వృత్తిలో చేరిన ప్రతిఒక్కరికీ పదవీ విరమణ అనేది సర్వసాధారణమైన విషయమని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు హృదయరాజు, జిల్లా నాయకులు ఇస్మాయిల్ అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆంతోనీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఐ.జె.అమలనాథన్ దంపతులను ఆదివారం రాంజల రోడ్డులోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విధుల్లో అంకితభావంతో ఎందరికో విద్యను అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన ఐ.జి.అమలనాథ టీచర్‌ను పలువురు ప్రశంసించారు. ఉద్యోగరీత్యా మచ్చలేని గొప్ప ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు చెల్లిందన్నారు. ఉద్యోగంలో చేరిన ప్రతివ్యక్తి సర్వసాధారణంగా పదవీ విరమణ కావడం సహజమేనన్నారు. ఈ కార్యక్రమానికి సెయింట్ ఆంతోనీ వారి పాఠశాల అనాథాశ్రమ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జాన్‌డేవిడ్‌లు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ విధుల్లో ఉన్నంతకాలం అమలనాథన్ విద్యార్థులకు గొప్ప సేవలు అందించారన్నారు. ఈయనను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్‌టీయూలకు చెందిన నాయకులు హాజరై ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ హెచ్ఎం సిస్టర్ సుజన, సెయింట్ ఆంతోనీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం సిస్టర్ సౌరీలు, ఉపాధ్యాయులు ఆవుల బసప్ప, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాధపూర్వకంగా కలసిన ఏపిఎన్జీవోలు



**ఎమ్మిగనూరు, జూన్17ప్రభాతవార్త:**
ఎమ్మిగనూరు తాలాకా ఏపి ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో మర్యాధపూర్వకంగా నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డిని ఏపిఎన్జీవో నాయకులు మద్దిలేటి,ప్రభుల ఆధ్వర్యంలో శాలువా, పూలబోకెలతో సన్మానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఈ ప్రభుత్వంలో ఉద్యోగులు సమస్యలు పరిష్కరించే విధంగా గత ప్రభుత్వంలో పెండిగ్లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంబంధించిన జిపిఎఫ్, ఏపిజి ఎల్ ఐ, మరియు సరెండర్ లివ్ బకాయులు వెంటనే చెల్లించే విధొంగా ప్రభుత్వంతో మాట్లాడి చెల్లింపులు జరిగే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలగే ఏపిఎన్జీవోస్ తాలాకా కార్యదర్శి శ్రీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వానికకి మరియు ప్రజలకు అనుసంధానంగా ప్రభుత్వం అందించే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడలో పూర్తి స్థాయిలో సహకరిస్తామని ప్రభుత ్వానికి మంచి పేరును తేవడంలో తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేను తెలిపారు. ఈకార్య క్రమంలో నాయకులు శివరామిరెడ్డి, సురేష్, రామకృష్ణ, బజారి, తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరి ప్రసాద్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు మల్లికార్జున, లోకేష్,చిన్న రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## 18న శ్రీహరి కూర్మనారాయణ జయంతి వేడుకలు

**ఆస్పరి,జూన్ 16,ప్రభాతవార్త**



ఈ నెల 18వ తేదీన శ్రీహరి కూర్మనారాయణ(నల్లగుట్టయ్య)11వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు నరేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని హాలిగేర గ్రామ కొండల్లో వెలసిన శ్రీహరి కూర్మనారాయణ జయంతి సందర్భంగా ఆలయంలో 5గంటలకు స్వామి వారికి క్షీరాభిషేకం,చందనాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం 27సార్లు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం ఉంటుందన్నారు. 9పుట్టలకు పాలు పోసి శ్రీ కూర్మనారాయణ గుట్టు చుట్టూ ప్రదక్షిణలు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఈ దివ్యక్షేత్రంలో ఉత్తరముఖ ద్వారం వైకుంఠం ద్వారంలో ఉండే కూర్మనారాయణను దర్శించుకుంటే చాలా మంచి జరుగుతుందని తెలిపారు. శ్రీహరి కూర్మనారాయణ జయంతి ఉత్స వాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలు కాకుండ ఇతర రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన వసతి కల్పిస్తారన్నారు.

## బక్రీద్‌ను సంతోషంగా జరుపుకోవాలి




**పత్తికొండ,జూన్ 16,ప్రభాతవార్త**
ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను సంతోషంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ,కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు,బిజెపి నాయకులు,ఆర్టీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామ్మోహన్‌లు అన్నారు. ఆదివారం కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో బక్రీద్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు దుస్తులు,చక్కెర,సేమియా ప్యాకెట్లు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ముస్లింలు బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దండి మల్లికార్జున,బ్రహ్మయ్య,పూన మల్లి,ట్రస్టు సభ్యులు లింగన్న,ఖాజాహుసేన్,పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఆదోని నందు వాల్మీకి మహర్షి విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు



**పత్తికొండ,జూన్ 16,ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా వాల్మీకి మహర్షి విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు ఆదివారం ఆదోని పట్టణంలోని శ్రీ మంగళాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించడం జరిగింది. జిల్లా నందు 26మండలాలకు సంబంధించి వాల్మీకి విద్యార్థులకు మండలం వారిగా ఫస్ట్,సెకెండ్,థర్డ్ ప్రైజ్‌లను మరియు గిఫ్ట్‌లను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి,మాజీ ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ,మున్సిపల్ చైర్మన్‌లు హాజరయ్యారు. ఏడు తాలుకాల్లోని వాల్మీకి ఉద్యోగ,ఉపాధ్యాయులు పాల్గొని మండలాల వారిగ వాల్మీకి విద్యార్థులకు మొదటి బహుమతి రూ.2వేలు,రెండో బహుమతి రూ.1500,మూడో బహుమతి రూ.1000లతో పాటు ఒక ఫైలు,ఒక మొమెంటో ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా పత్తికొండ తాలుకకు చెందిన ఐదు మండలాల విద్యార్థులకు వాల్మీకి ఉద్యోగులు,ఉపాధ్యాయులైనటువంటి ఆస్పరి సాయిబాబా,ఆర్ఐ రవికుమార్,హాస్టల్ వార్డెన్ రమేష్,ఫారెస్ట్ ఆఫీసర్ రవి,టీచర్లు రామానాయుడు,వీరేష్, రామాంజిని,సురేంద్ర,ఆస్పరి శ్రీనివాసులు పాల్గొని జయప్రదం చేశారు. ఇందులో భాగంగా తాలుక ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఆస్పరి సాయిబాబాను జిల్లా వాల్మీకి ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించడం జరిగింది.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు




**శ్రీశైలంప్రాజెక్టు,జూన్16,ప్రభాతవార్త**
శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)ఆదివారంనాడు అమృత కూచిపూడి నృత్యకళా నిలయం,అనంతపురం వారిచే స ంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ క్యాక్రమంలో శివశంంఖరా,శివాష్టకం,శవతాండవం,జయ జయ దుర్గా,నమ:వివాయతే, తదితర అష్టకాలకు,గీతాలకు మైత్రి,నైనిత,ధని,ఉపాసన,గంగ,మన్విత తదితరులు నృత్య ప్రదర్శన చేసారు.తదుపరి రెండవ కార్యక్రమంలో భాగంగా వి.లోవరాజు మరియు వారి బృందం,తూర్పు గోదావరి జిల్లా వారిచే దక్షయజ్ఞం బుర్రకథ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయ నృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాదన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## శ్రీగిరిలో వైభవంగా పల్లకీ సేవ



**శ్రీశైలంప్రాజెక్టు,జూన్16,ప్రభాతవార ్త :** లోక కల్యాణం కోస ం దేవస్థానం ఆదివారంనాడు రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్స వం నిర్వహించడం జరిగింది.ఈ పల్లకీ ఉత్స వం ప్రతి ఆదివారం,పౌర్ణమి మరియు మూల నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా(సర్కారి సేవగా) జరిపించబడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతి పూజ జరిపించబడింది.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్స వమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

**కర్నూలు కలెక్టరేట్,జూన్ 16,ప్రభాతవార్త**



ముస్లిం సోదర,సోదరీమణులకు కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ పండుగ ఒకటని ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులతో పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో సంతోషంగా జరుపుకుని అల్లాహ్ కృపకు పాత్రులవ్వాలని కోరారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని, ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ దాన,గుణానికి,త్యాగానికి ప్రతీక అని వారు తెలిపారు. కుటుంబ సభ్యులతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం



**పత్తికొండ,జూన్ 16,ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం హర్షణీయమని బిజెపి సీనియర్ నాయకుడు సిసి రంగన్న,లక్ష్మణస్వామి నాయుడు అన్నారు. ఆదివారం ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ గతంలో ఆందోళనలు చేశామన్నారు. ఈ చట్టంలో అనేక లోపాలు ఉన్నాయని అది అమలు అయితే న్యాయవాదులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అయితే నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం ఏపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సిఎం చంద్రబాబుకు న్యాయవాదుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆదోనిలో సినీ నటుడు సుమన్ సందడి..

**– నూతన షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటుడు**

**ఆదోనిటౌన్, జూన్16, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలో ప్రముఖ సినీ నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సుమన్ సందడి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఎద్దుల కాటన్ ప్రయివేట్ లిమిటెడ్ ఇన్నర్‌వేర్ షోరూమ్‌ను సుమన్ చేతులమీదుగా ప్రారంభించారు. ముందుగా ఆయన షోరూమ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల బ్రాండ్లతో ఇన్నర్‌వేర్ ఆడ, మగ చిన్నారులకు సంబంధించి 31 రకాల బ్రాండ్లతో ఉన్న ఇన్నర్‌వేర్ షోరూమ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. అన్నిరకాల బ్రాండ్లు ఇక్కడే లభిస్తాయని, నాణ్యమైన అతి తక్కువ ధరతో ఈ షోరూమ్‌లో లభిస్తాయన్నారు. అనంతరం షోరూమ్ నిర్వాహకుడు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చిన కస్టమర్‌కి ఇష్టమైన బ్రాండ్ల కోసం మరొక చోటుకు వెళ్లకుండా షోరూమ్‌కు వస్తే అన్ని రకాల బ్రాండ్లు ఇక్కడే లభిస్తాయన్నారు. కస్టమర్ల ఇష్టాలకు అనుగుణంగా షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ షోరూమ్ ప్రారంభోత్స వానికి ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అధికార ప్రతిపక్ష పార్టీల మధ్యలో రగులుతున్న సంఘర్షణలు..!?

: సహనం ఓపికతో ఐదేళ్లు రాజకీయం చేసిన నేత
: ప్రజలే దేవుళ్లుగా బావించే మరోనేత ఆచూకి ఎక్కడా
: ఆత్మకూరు పట్టణంలో అసలు ఏమి జరుగుతుంది
: భూకబ్జాలు, బెదరింపులు అసాంఘిక శక్తులకు కొమ్ముకాసే పార్టీలకు అడ్డుకట్టపడేనా
: వరుసగా జరుగుతున్న సంఘటనలపై మౌనం ఎందుకు

**ఆత్మకూరు జూన్16,ప్రభాతవార్త:** అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్యలో రగులుతున్న సంఘర్షణలపై ఆత్మకూరు పట్టణంలో జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. సహనం, ఓపికతో ఐదు సంవత్సరాలు ప్రతి పక్ష పార్టీలో రాజకీయం చేసిన నేత నేడు ప్రజలనే దేవుళ్లుగా బావించి నియోజకవర్గంలో ఇటివలే కాలంలో జరిగిన సామాజిక సార్వత్రిక ఎన్నికలో ఉహించని రాజకీయం మలుపు తిరిగి నియోజకవర్గ అసెంబ్లీ శాసన సభ్యులుగా గెలుపోందారు. ఐదు సంవత్సరాల అధికార వైసిపి పరిపాలనలో భూకబ్జాలు, బెదరింపులు, దౌర్జనాలు చేస్తూ నిరుపేద కుటుంబాలకు చెందిన భూములను అక్రమంగా కబ్జా చేసుకోని పేద ప్రజలను చులకన బావన చూసిన నేతలకు చివరకు సంఘర్షణలు జరగడం ప్రారంభమైందని చెప్పవచ్చు. పట్టణంలో కొన్ని చోట్ల రహదారులపై మరి కొన్ని చోట్ల గల్లిలో రహస్యంగా వైసిపి, టిడిపి పార్టీ నాయకులు ఒకరిపై ఒక్కరు పరస్పరంగా దాడులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాగే కొనసాగితే ఆత్మకూరు ప్రాంతంలో మరోసారి ఫ్యాక్షన్ గ్రామంగా మారబోతుందని మేదావులు, రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేసుకుంటున్నారు. మరో నాయకుడు ప్రజల దేవుళు అని చెప్పి చివరకు నమ్మకున్న నాయకులకు, కార్యకర్తలకు దాడులు జరుగుతున్న ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. కేవలం రాజకీయ స్వాలాభం కోసం మద్యలో పేద ప్రజలను రెచ్చగొట్టి అధికారంను అడ్డుపెట్టుకోని నియోజకవర్గంలో చేసిన దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలపై నేడు మళ్లీ అదే వాతవరణం నియోజకవర్గంలో మొదలవుతుందనే విషయంను కొందరు మేదావులు గమనిస్తున్నారు.
చెడ్డి నాయకుడుపై సిద్ధమవుతున్న మరో పార్టీ నేతలు... అధికార పార్టీలో అని తానై వ్యవహరించిన ఓ చెడ్డి నాయకుడిపై దాడి చేసేందుకు మరో పార్టీ నాయకులు సిద్ధమవుతున్నట్లు ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు చర్చించుకోవడం ఆత్మకూరు పట్టణంలో హాట్‌టాఫిక్‌గా మారిందని చెప్పవచ్చు. ఇంతకు ఎవరు ఈ చెడ్డి నాయకుడు అని అనుకుంటున్నారా గత వైసిపి ప్రభుత్వంలో అన్ని పార్టీ కార్యక్రమాలో నేనే ముందుండాలంటూ వెళ్లిన గత అధికార పార్టీ శాసన సభ్యునికి ముఖ్య అనుచరునిగా ఉంటూ కీలకపాత్ర పోషించిన ఆ పార్టీ నేతకే చివరకు వెన్నుపోటు రాజకీయాలు తీసుకోని వచ్చారని చెప్పవచ్చు. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్న పరస్పర అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మద్యల సంఘర్షణలు జరిగే క్రమంలో ఆ నాయకుడికి చెడ్డి నాయకుడుగా గుర్తింపు రావడంతో త్వరలోనే ఈ నాయకుడిపై దాడి చేసేందుకు మరో పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారంటూ పట్టణంలో ఎక్కడా చూసిన చర్చలు కొనసాగుతున్నాయి. ఏదిఏమైన్నప్పటికి ఇలాంటి సంఘర్షణలు కొనసాగుతే ప్రశాంతంగా ఉన్న ఆత్మకూరు ప్రాంతం మరో ప్యాక్షన్ ప్రాంతంగా మారే అవకాశం ఉందని పలువురు ప్రజానీకం వాపోతున్నారు.

## ఎల్లమ్మ ఆలయ శిఖరాగ్ర నిర్మాణానికి రూ.25వేలు విరాళం



**దేవనకొండ, జూన్ 16,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయ శిఖరాగ్ర నిర్మాణానికి రూ.25వేలను కర్నూలు జిల్లా వినియోగదారుల కమిటీ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి విరాళం అందచేశారు. ఆదివారం తెర్నేకల్ గ్రామంలో ఎల్లమ్మపేట వీధిలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా వినియోగదారుల కమిటీ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బాటమీద రాజన్నలు మాట్లాడుతూ గ్రామాభివృద్దిలో గ్రామస్తులు అందరు భాగస్వాములు కావాలని అన్నారు. జన్మించిన ఊరిని మర్చిపోకూడదనే సంకల్పంతో గ్రామ అభివృద్దిలో తమవంతు సహకారం అందిస్తామన్నారు. అదేవిధంగా ఆలయ గోపుర నిర్మాణం పూర్తయిన తర్వాత రంగులు వేయిస్తానని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిటీ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. 2017లో సర్పంచ్‌గా పనిచేసిన రాజన్న కళ్యాణ మండపాన్ని నిర్మించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతిఒక్కరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్ మాదన్న, గ్రామపెద్దలు హనుమన్న, పూజారి నారాయణస్వామి, వాసు, చిన్న హనుమంతు, మల్లేష్, పూల్లాపురం కిష్టన్న పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

: తక్షణమే రోడ్డు, డ్రైనేజి,త్రాగునీటి సమస్యలు పరిష్కరించండి- సిపిఐ డిమాండ్



**ఎమ్మిగనూరు క్రైం, జూన్17ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందని ఎక్కడ చూసిన ప్రదాన రోడ్ల నందు నీరు నీలించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారుని సిపిఐ పార్టి నాయకులు పట్టణ కార్యదర్శి జి రంగన్నలు తెలిపారు. ఈసందర్బంగా రంగన్న మాట్లాడుతూ 5సంవత్సరాల నుండి పట్టణంలో కనీసం మౌలిక సదుపాయాలై రోడ్లు, డ్రైనేజిలు, విద్యుత్తు, త్రాగునీరు వంటి ప్రజలకు సౌకార్యలు కల్పించడంలో అప్పటి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిదన్నారు. కేంద్రంవెచ్చించిన 14 ఫైనాన్స్ నిధులతో తూతూ మంత్రంగా పలు వార్డులలో మునిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు సిసి రోడ్లు వేసి చేతులు దులుపుకోన్నారుని వారు అవేధన వ్యక్త చేశారు.కావునా టిడిపి ప్రభుత్వ పట్టణంలో మౌలిక వసతులపై ప్రత్యేక చర్యలు తీసుకోని ప్రజలకు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో కేసి జబ్బర్, కాజా, ఇస్మాయిల్, నరిసింహులు,హుస్సేన్, ఖాజాబీ, ఈశ్వరమ్మ కాలని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్‌రెడ్డికి పితృవియోగం

- నివాళులర్పి ంచిన రామకృష్ణారెడ్డి



**సింగరాజనహళ్ళి(మంత్రాలయం), జూన్ 16,ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగరాజనహళ్ళి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డికిపితృవియోగం జరిగింది. గతకొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గోపాల్‌రెడ్డి త ండ్రి రామలింగారెడ్డి ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టిడిపి యువనేత రామకృష్ణారెడ్డి గోపాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించాడు. రామలింగారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని తెలియజేశారు. వీరివెంట మాలపల్లి లక్ష్మణ్ణ, ఈరన్న, గంగన్న, హనుమయ్య, వీరేష్, బొడ్డన్న తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించాలి: సిపిఐ



**సజ్జలగుడ్డం(కోసిగి), జూన్ 16, ప్రభాతవార్త**

ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించి మహిళ ప్రతిష్టతను కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేసారు..ఆదివారం మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో మహిళలు పడుతున్న ఇబ్బందులను సిపిఐ దృష్టికి తీసుకొచ్చారు..దీంతో సిపిఐ గ్రామ కార్యదర్శి మూకప్ప ఆధ్వర్యంలో మహిళలతో కలసి మాట్లాడారు..అనంతరం గోపాల్ మాట్లాడుతూగ్రామంలో మహిళలు రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు..ఇక గ్రామంలోఏవైనా పండుగలు, దేవరలు చేస్తే వచ్చిన బందువులు బహిర్భూమికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేసారు..వర్షాకాలం కావడంతో ఎక్కడ ఏమి జరుగుతుందోననే భయంతో మహిళలు ఉన్నారని, కాగా గత ప్రభుత్వంలోనే ఇంటింటికి మరుగుదొడ్డి కట్టించాలని డిమాండ్ చేసామన్నారు.. అయితే గత ప్రభుత్వం ఈ విషయంలో అలసత్వంతో మహిళల గౌరవాన్ని మరిచి వారికి ఇంటింటికి మరుగుదొడ్లను కట్టించలేదన్నారు.. ఈ ప్రభుత్వంలోనైనా ఇంటింటికి మరుగుదొడ్లు కట్టించి మహిళల గౌరవాన్ని కాపాడాలనా న్నరు..వర్షాకాలంలో రాత్రిళ్లు బహిర్భూమికి వెళ్లేందుకుమహిళలు భయపడుతు న్నారని, రాత్రివేళ్లలో విషపురుగులు సంచారం చేస్తుండడంతో మహిళలు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు..ఇప్పటికైన ప్రస్తుత ప్రభుత్వం ఇలాంటి విషయాలపై దృష్టి సారించి ఇంటింటికి మరుగుదొడ్లునిర్మించాలని డిమాండ్ చేసారు.. సిపిఐ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు..

## పాదయాత్ర యువగళంలో ఇచ్చిన హామిలు నేరవేర్చండి

- ఏపీటిఎఫ్ నాయకులు




**నంద్యాల విద్య, జూన్ 16, ప్రభాతవార్తః**

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామిల మేరకు ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికై పాటుపడాలని ఏపీటిఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి శివయ్యలు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాధమిక పాఠశాలలో 1 నుండి 5 తరగతులను యధావిదిగా కొనసాగించాలని జిఓనం.117ను రద్దుచేస్తామని పాదయాత్రలో హామి ఇచ్చారని వారు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే అమలు చేయాలని పాఠశాల నిర్వహణ గ్రాంట్‌లను పాఠశాల అభివృద్ధి కోసం వెంటనే విడుదల చేయాలని, నాడు నేడు బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిఎస్సీకి వయోపరిమితిని పెంచాలని ఉపాధ్యాయులపై పనిభారంగా మారిన యాప్‌లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని అన్‌లైన్‌లోని కార్యక్రమాలన్నింటిని డిజిటల్ అసిస్టెంట్, ఎమ్మార్సీ సిబ్బందికి అప్పగించాలని సిపిఎస్‌ను రద్దుచేయాలని, ఈహెచ్ఎస్‌ను అన్ని అసుపత్రుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వీరేశ్వరరెడ్డి, రంగనాయకులు, తిమ్మారెడ్డి, శ్రీరాములు, పుల్లయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భవనాల శాఖ మంత్రిని సన్మానించిన యస్‌టియు ఉపాధ్యాయులు



**కోవెలకుంట్ల ,జూన్ 16,ప్రభాతవార్త**

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మం త్రి బిసి జనార్దనరెడ్డి ని యస్‌టియు ఉపాధ్యాయులు ఘనంగా సనా ్మనించారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రిగా నియమితులైన బిసి జనార్దనరెడ్డి అదివారం యస్‌టియునంద్యాల జిల్లా కార్యదర్శి అజాంబేగ్ రాష్ట్ర అదనపు ప్రదానకార్యదర్శి గుంగుల వెంకటవరప్రసాదరెడ్డి నేతృత్వంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

## ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీఓ 117ను రద్దు చేయాలి



**ఆదోని, జూన్ 16,ప్రభాతవార్త :** ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన జీఓ నం.117ను రద్దు చేయాలని ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి సుంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌టియు ఆదోని,కౌతాళం ముఖ్య నాయకుల సమావేశం స్థానిక ఎస్‌టియు భవన్ నందు జరిగింది. ఈ సమావేశానికి ఎస్‌టియు మండల అధ్యక్షుడు సి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంసి సుంకన్న మాట్లాడుతూ ప్రజాగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీఓ నం.117ను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. అలాగే ఎస్‌టియు జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయ,ఉద్యోగ సమస్యల్లో భాగంగా ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు,ఆర్‌బి వెంకటేశులు,యల్ రామ్మోహన్‌రెడ్డి,రంగన్నగౌడ్,పి అంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ "షష్టిపూర్తి" లోగా గ్రామ గ్రామాన కమిటీలు వేయాలి



**కర్నూలు విద్య, జూన్ 16, ప్రభాతవార్తః**

విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తిలోగ గ్రామ గ్రామాన కమిటీలు వేయాలని దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రెవిన్యూ కాలనీలో భరతమాత మందిర ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకర్ల రాముడు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి చేసుకోబోతున్న సందర్భంగా 1964 సంవత ్సరంలో పవిత్ర శ్రీకృష్ణ జన్మాష్టిమి రోజున ముంబాయిలోని సాందీపని ఆశ్రమంలో పుట్టిన విశ్వహిందూ పరిషత్ దిన దిన ప్రవర్తమానమై 125 దేశాల్లో, భారతదేశంలో 60 లక్షల మంది కార్యకర్తలు, 12 వేల మంది పూర్తి సమయ కార్యకర్తలు తమ జీవితాలను పూర్తిగా సంస్థకే ఇచ్చి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ 16 విభాగాలుగా పనిచేస్తున్నాయని హిందూ సమాజానికి ఎదురయ్యే అనేక సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలౌతుందన్నారు. జిల్లా కార్యకర్తలందరు షష్టిపూర్తి సందర ్భంగా జిల్లాలోని అన్నిప్రఖండలలో కనీసం నలుగురు కార్యకర్తలతో సమితుల నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ రాబోయే షష్టిపూర్తి సందర్భంగా జిల్లాలో 9 మండలాల్లో నగరంలోని 195 బస్తీల్లో తప్పక సమితుల నిర్మాణంచేస్తామని ఈ 40 రోజులు యుద్ధ ప్రాతిపదికన ఈసమితుల నిర్మాణం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, విభాగ్ బజరంగ్ దళ్ కన్వీనర్ నీలి నరసింహా, కర్నూలు జిల్లాకార్యదర్శి మాళిగి భానుప్రకాష్, గిరిబాబు, గోవిందరాజులు, రాజేష్, రాధిక, రమేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీ సంతకంపై థ్యాంక్యూ సీఎం కార్యక్రమం

- రాయలసీమ ఉద్యమ యువ నాయకుడు రాథోడ్




**కర్నూలు విద్య, జూన్ 16, ప్రభాతవార్తః**

ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ మొదటి సంతకం మెగా డిఎస్సీపైనే చేస్తానని వాగ్దాం చేసి చెప్పినట్టు డిఎస్సీపై మొదటి సంతకం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు థాక్యూ సీఎం కార్యక్రమం ద్వారా కృతజ్ఞతలు తెలిపినట్లు రాయలసీమ ఉద్యమ యువ నాయకులు రాథోడ్ సీమ కృష్ణ పేర్కొన్నారు. కర్నూలు పట్టణంలో ఆదివారం స్థానిక ఆశోక స్టడి సర్కిల్‌లో రాయలసీమ ఉద్యమ యువ నాయకుల సమక్షంలో డిఎస్సీ నిరుద్యోగులు థాక్యూ సీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర ్భంగా రాయలసీమ ఉద్యమ యువ నాయకులు, రాయలసీమ విద్యార్థి సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాథోడ్ సీమ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో డిఎస్సీపై ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసి 16,347 ఉద్యోగాలు భర్తీచేస్తున్న కూటమి ప్రభుత్వానికి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాయలసీమ ఉద్యమ యువ నాయకుల అధ్వర్యంలో నిరుద్యోగులు థాక్యూ సీఎం ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో చంద్ర, గణేష్, జయరాంలు పాల్గొన్నారు.

## అనారోగ్య భాదితుడిని పరామర్శ

**దేవనకొండ, జూన్ 16,ప్రభాతవార్త**



మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన వడ్డే మాదన్న అనే వృద్దులు గత పదిరోజులుగా పెంచికలపాడు విశ్వభారతి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న జిల్లా వినియోగదారుల కమీషన్ సభ్యులు న్యాయవాది తెర్నేకల్ నారాయణరెడ్డి పరామర్శించి భాదితుని కుమారుడు రెండవ వార్డుమెంబర్ మాదన్నకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోని తన విద్యాభ్యాసంలో మాదన్న కుటుంబం అన్ని రకాల సహకారం అందించిందని అందుకుగాను కృతజ్ఞతాభావంతో ఆర్థిక సహాయం అందించానన్నారు.

## ఏవిఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కె.నాగరాజు

**నందికొట్కూరు, జూన్ 16,ప్రభాతవార్త:**



ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏక గ్రీవంగా ఎన్నిక అయినట్లుగా తెలిపారు. ఆధివారం తాడెపల్లిగూడెంలో ఏవిఎస్ రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ తురక ప్రసాద్, కార్యదర్శిగా కుమ్మరి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లుగా తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్ర నాయకులు తమపై నమ్మకం ఉంచి భాధ్యతలు అప్పగించడంపై వారు హార్షం వ్యక్తం చేస్తు విద్యార్థుల సమస్యలపై పోరాడుతామని తెలిపారు.

# మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసి విశ్వసనీయత చాటుకున్న ముఖ్యమంత్రి

**- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**



**నంద్యాల, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధిః** ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్సీ పై తొలిసంతకం చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విశ్వసనీయత చాటుకున్నారని రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బనగానపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏరా ్పటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామి మెగా డిఎస్సీ మొదటి సంతకాన్ని పెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేశారని కొనియాడారు. ఎన్నికల్లో చెప్పిన హామిలను బాధ్యతలు స్వీరించిన వెంటనే మొదటి ఐదు ఫైళ్ళపై ఏపీ ప్రజలకు ఇచ్చిన హామిమేరకు ల్యాండ్ టైటింగ్ యాక్టు రద్దుపై రెండవ సంతకం, పెన్షనర్ల పెంపుపై మూడవ సంతకం, అన్నక్యాంటిన్ల పునరుద్దరణపై నాల్గవ సంతకం, స్కిల్ సెన్సెస్‌పై ఐదవ సంతకం చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు విశ్వసనీయత చాటారని ప్రతే ్యక ధన ్యవాదాలు తెలిపారు. రాబోయే ఐదు సంవత ్సరాల్లో నిరుద్యోగులు ఇచ్చిన హామి 20 లక్షల ఉద్యోగాలు పూర్తి అమలుచేస్తామని స్పష్టం చేశారు. వైసీపీ రాక్షస పాలనకు అంతం పలికిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఏవిధంగా రాష్ట్రానికి పెట్టుబడుల వరద అయి వచ్చాయో గుర్తుచేశారు. జాబులు ఇచ్చేది బాబే, పెట్టుబడులు తెచ్చేది బాబే అని ఏపీకి మంచిరోజులు వచ్చాయని సమన్యాయం, సుపరిపాలన ఎన్డీయే ప్రభుత్వం వల్లే అయిద్దని రోడ్లు, భవనాలు మౌలిక వసతులు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు అనాడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి ప్రతి యేటా మెగా డిఎస్సీ పెడతామని వచ్చిన వెంటనే 24 వేల డిఎస్సీ పోస్టులు భర్తీచేస్తామని దొంగ హామిలు ఇచ్చి అప్పటి మంత్రి బొత్సతో కేవలంలో 7,500 పోస్టులు మాత్రమే ఖాళీగా వున్నాయనిచెప్పి అవి కూడ ఎన్నికల నోటిఫికేషన్ ముందు మెగా పేరుతో దగా డిఎస్సీ అంటూ ప్రకటించి అవికూడ భర్తీచేయకుండా మోసం చేశారని పేర్కొన్నారు. 7,500 పోస్టులకు రెట్టింపు చేసి 16,347 డిఎస్సీ పోస్టులతో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే మెగా డిఎస్సీ ఫైల్‌పై తొలిసంతకం చేసి నిరుద్యోగ పక్షపాతిగా నిలిచారని కొనియాడారు.

# రానున్న కాలం మనదే అధైర్యపడవద్దు : డా.సుధీర్

**నందికొట్కూరు, జూన్ 16, ప్రభాతవార్త:** ఓటమి చెందామని నిరాశ పడకండి రానున్న కాలం మనదే అధైర్యపడవద్దని వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన డాక్టర్.దారా సుధీర్ తెలిపారు. ఆదివారం స్తానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు ముందుగా ఎని ్నకల్లో తనకు ఓటువేసిన 80వేల మందికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా వైకాపా ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇచ్చిందని ఆయిన ఓటమి చెందామని, దాని కారణాలపై విశ్లేషణ చేసుకుందామని, గెలుపు ఓటమిలు సహజమని 5 ఏళ్ళు ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుదామని వారికి వెన్నుదన్నుగా నిలబడుదామని 2029లో మనదే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రజలు నాపై చూపిన ఆదరణ నా జీవితంలో మరువలేనిదని అంతగా నన్ను ఆదరించారని ఆయన తెలిపారు. నూతన ప్రభుత్వంలో మనపై కేసులు వేధింపులు ఉంటాయని అన్నింటిని ఎదుర్కోందామని, మనకు అండగా వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నాడని ఇక్కడ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో నిలబడుదామని నేను ఎప్పుడు మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం ఆయన




వైసిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి ధైర్యం కల్పిస్తు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లుగా నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జడ్పీటిసి పోచా జగదీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, సురేష్, హామీద్, మాజీ మార్కెట్‌యార్డు తువ్వా చిన్నమల్లారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, జబ్బార్‌మియ్య, సర్పంచులు, యం.పి.టి.సి.లు భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వసతిదీవేన విద్యాదీవేన బకాయిల వివరాలు ఇవ్వండి..



**నంద్యాల విద్య, జూన్ 16, ప్రభాతవార్తః** రాష్ట్రవ్యాప్తంగా విద్యాదీవేన వసతిదీవేన పథకాల కింద ప్రభుత ్వం విద్యార్థులకు చెల్లించాల్సి న బకాయిల వివరాలను సమర్పించాలని రాష్ట్ర మానవ వనరుల ఐటి ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ అదేశించారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో మంత్రి సమావేశం అయ్యారు. తాను పాదయాత్ర నిర్వహించిన సమయంలో వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల తమ సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉన్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంజనీరింగ్ కళాశాల్లో ఫీజులు ఏ మేరకు ఉండాలనే విషయంపై ఒకనోట్ సమర్పించాలని అధికారులను అదేశించారు. వివాదాస్పద వీసిలు యూనివర్శిటిల్లో జరిగే అవినీతి ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని అధికారులను అదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గడంపై కూడ రిపోర్టు ఇవ్వాలని అదేశించారు. కార్య క్రమంలో ఉన్నత విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

# వైసిపి నుండి టిడిపిలో చేరిన 150కుటుంబాలు



**ఆదోని, జూన్ 16, ప్రభాతవార్త** పట్టణంలో టిడిపి ఇంచార్ ్జ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు సమక్షంలో 150కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరారు. పట్టణం నుండి మాజీ కౌన్సిలర్ అంజని, నాగలాపురం నుండి వెంకటేష్, లింగన్నల ఆద్వర్యంలో రాంప్రసాద్, జనార్థన్, చిన్న వీరేష్, పెద్ద వీరేష్, శ్రీనివాసులు, తిమ్మప్ప, చిన్ని రామాంజనేయులు, పెద్ద ఉరుకుంద, మోహన్, వెంకటరాముడు, గోవిందు, పట్టణంలో ఎంఎం కాలనీ నుండి వేణు కుమారులు రామయ్య, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, గిరి, శివశంకర్, చరణ్, అజయ్, రవికుమార్‌లు టిడిపిలో చేరారు. వీరికి మీనాక్షినాయుడు టిడిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుంద న్నారు. కావున ప్రతిఒక్కరు కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నోపార్కింగ్ బోర్డులను తొలగించిన పోలీసులు

**- బారీకేడ్‌ల ఏర్పాటు - ప్రభాతవార్తకు స్పందన**



**నంద్యాల విద్య, జూన్ 16, ప్రభాతవార్తః** జిల్లా కేంద్రమైన నంద్యాలలో రోజు రోజుకు అక్రమణలు పెరిగిపోతున్నాయని శ్రీనివాస సెంటర్‌లో శ్రీనిధి హోటల్ ఎదురుగా ప్రైవేట్ దుకాణాదారులు నో పార్కింగ్ బోర్డును ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న వార్త ప్రభాతవార్తలో శనివారం ప్రచురితమయింది. ప్రచురితమైన వార్తకు స్పందించిన పోలీసులు ప్రైవేట్ దుకాణాదారుని ఎదురుగా ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డులను తొలగించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నడిరోడ్డుపై ఇలా నో పార్కింగ్ బోర్డును నిబంధనల ప్రకారం పెట్టకూడదని హెచ్చరించారు. అనంతరం ఆ ప్రాంతంలో బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో పలు చోట్ల ట్రాఫిక్ నిబంధనలకనుగుణంగా వ్యవహారించాలని లేనిచో పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకొని బారీకేడ్‌లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో వచ్చిన వార్తలకు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం నూతన ప్రభుత్వం విధానాలకు రూపం పడుతుందని మంత్రి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం కాబట్టి చర్యలు తీసుకోవడం సహజమన్నారు.

# పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ; ఎమ్మెల్యే గిత్త జయసూర్య




**మిడుతూరు, జూన్16, ప్రభాతవార్త;** రైతులు పండించిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ఆదివారం మిడుతూరు వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ కింద మంజూరైన కంది విత్తనాల ప్యాకెట్లను వ్యవసాయ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి చేతులమీదుగా రైతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రైతుల అవసరాలను గుర్తించి వారికి అవసర మయ్యేవిధంగా సకాలంలో అందజేసేందుకు తెలుగు దేశం పార్టీ ముందు ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాడని, వారిని మరింత ఆదుకునేందుకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అంతేగాకుండా నియోజకవర్గ రైతులకు అవసరమయ్యే పనులను వెంటనే చేపడతామన్నారు. పిలిస్తే పలికే ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేవిధంగా అడుగులు వేస్తున్నామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఐదు పథకాలపై మొదటి సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. నియోజక వర్గం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి, సర్పంచ్ జయలక్ష్మమ్మ, కాతా విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు విజయశేఖర్, వ్యవసాయ అధికారి పీరునాయక్, ప్రాతకోట మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, వివిద గ్రామాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవినితికి పాల్పడిన అధికారుల నుండి సోమ్మును రాబడుతా : ఎమ్మెల్యే



**ఎమ్మిగనూరు, జూన్17ప్రభాతవార్త:** మునిసిపల్ శాఖాలో మెప్మా తదితర శాఖాలలో అవినితికి పాల్పడినట్లు మా దృష్టికి వచ్చిందిన వాటిని వారి నుండి మహిళలకు రావాలసిన నిధులలో అన్యాయం జరగకుండా అధికారులపై ప్రత్యేక చర్యలు తీసుకోంటాముని శాసనసభ్యులు డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఈసందర్బంగా ఆదివారం స్థానిక మునిసిపల్ కౌన్సిల్‌లో మునిసిపల్, మెప్మా.ఆర్పిలు, సెర్పు శాఖాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కౌన్సిల్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ సాధికారత బూట్టదాకాలు చేస్తూ సోంతి ఇంటిలా అవినితికి పాల్పుడరిని అధికారుల కూడా సరైన సమాదనం తెల్పడంలేదని మార్ట్ కోసం దాదాపు రూ 20 లక్షలు తీసుకోన్నామని ఇలా సోంత ఇంటిలా ప్రజా ధనాని లూటి అప్పటి ప్రభుత్వం చేసిందిని, ఇలా అన్ని గ్రూపుల నుండి ప్రతి ఒక్క ఫైల్‌ను పరిశీలిస్తామని ప్రతి ఒక్క రూపాయి ప్రజలకు రావలసిన వాటిని ప్రజలకు నష్టం వాటిలకుండా అవినితికి పాల్పడిన ప్రతి ఒక్కరు బాద్యత తీసుకోనేవింధగా చర్యలు తీసుకోంటామన్నారు. గ్రుప్పులో ఉన్న అధికారుల నుండి వారి దగ్గర ఉన్న చెక్కులను స్వాధీనం చేసుకోన్నామని గాడి తప్పిన మునిసిపాలిటిని మళ్లి రాష్ట్రంలోనే మొదటి స్థానానికి తీసుకోనే విధంగా చర్యలు తీసుకోంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, మెప్మా అధికారులు పాల్గోన్నారు.

# ఏపి దేవదాయశాఖ మంత్రి కలసిన శ్రీశైలం ఈఓ



**శ్రీశైలంప్రాజెక్టు, జూన్16, ప్రభాతవార్త :** ఏపి రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ నూతన మంత్రి అయిన ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారంనాడు నెల్లూరులో వారి నివాసం వద్ద శ్రీశైలం దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్బంగా మంత్రివర్యులకు వేదాశీర్వచనంతో శ్రీస్వామిఅమ్మవార్ల శేష వస్త్రలు, లడ్డు ప్రసాదాలను, చిత్రపటంను అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలదేవస్థానం అర్చకస్వాములు, వేదపండింతులు పాల్గోన్నారు.

# శ్రీశైల మల్లన్న సన్నిదికి పోటేత్తిన భక్తజనం



**శ్రీశైలంప్రాజేక్టు, జూన్16, ప్రభాతవార్త** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహపుణ్యక్షేత్రంలో ఆదివారంనాడు భక్తుల రద్దితో క్యూలైన్లన్ని కిక్కిరిసిపోయాయి. భక్తులతో శ్రీగిరి క్షేత్రమంత జనసంధోహంతో నిండుకుంది. వేసవికాలం సెలవులు ముగింపు వస్తున్న క్రమంలో భకు ్తలు పెద్ద సంఖ్యాలో శ్రీశైలంకు తరలివచ్చారు. ఈక్రమంలోనే శ్రీశైలం రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తి శ్రద్దలతో ముందుగా తమ మ్రొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తూ తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు. కాగా మల్లన్న దర్శనబాగ్యం కొరకు భక్తుల సంఖ్యా పెరగడంతో ఆలయంలోని క్యూలైన్లన్ని నిండిపోయాయి. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అల్పాహరం అందజేయడం జరుగుతుంది. ఈక్రమంలోనే దర్శనబాగ్యం కోరకు వచ్చిన భక్తులకు దేవస్థానం అదికారులు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా ఏర్పాట్లను చేసారు. అదే విధంగా భకు ్తల ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాదికారి డి.పెద్దిరాజు అదికారుల నుండి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుంది. కాగా భక్తుల రద్దితో పురవీదులన్ని సందడి చెస్తున్నాయి.

# క్రీడారంగం అభివృద్ధికి కృషిచేస్తా

**- ఎంపీ బస్తిపాటి నాగరాజు**



**కర్నూలు హాస్పిటల్, జూన్ 16, ప్రభాతవార్తః** క్రీడారంగం అభివృద్ధికి కృషిచేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. క్రీడా సంఘాల ప్రతినిధులు స్టేడియం శిక్షకులు ఎంపీ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎపీ నాగరాజు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు మనిషి శక్తిని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు మనోరంజక సాధనాలలో ముఖ్యభాగమై పోయిందన్నారు. సాంప్రదాయకమైన ఆటల కంటే ఆధునిక ప్రపంచ ఆటలలో ప్రావీణ్యం సంపాదిస్తే పేరు ప్రతిష్టలతో పాటు మంచి ఆదాయం లభించే అవకాశాలున్నాయన్నారు. ఆయన జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవలేదని అయితే వారికి సరైన సదుపాయాలు కల్పిస్తే రాష్ట్ర జాతీయస్థాయిలో మరింత రాణిస్తారన్నారు. ఈకార్యక్రమంలో అల్ ఇండియా యోగ అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి ఆంధ్రప్రదేశ్ డ్రాగన్ బోట్ అసోసియేషన్ అధ్యక్షులు జి శ్రీదర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార ్యదర్శి అవినాష్‌శెట్టి, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధానకార్యదర్శి డా.రుద్రారెడ్డి, టిడిపి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు దాశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ..

# త్యాగానికి ప్రతీక

**- జిల్లా ప్రజలందరికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు**

**- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**నంద్యాల, జూన్ 16, ప్రభాతవార్త ప్రతినిధిః** ముస్లీం సోదరులకు బక్రీద్ పర్వదినం అత్యంత అరాధ్యమైన ప్రీతీకరమైందని.. బక్రీద్ పండుగ.. త్యాగానికి ప్రతీకని రాష్ట్రమైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ముస్లీం అరాధ్య గ్రంధం దివ్యఖురాన్ ప్రకారం సమాజంలో త్యాగనిరక్తికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి త్యాగానికి ప్రతీక అన్నారు. ఈపండుగ నంద్యాల జిల్లా వాసులకు సకల శుభాలతో పాటు అయురారోగ్యాలు అందాలని అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తు రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో పాటు ఆర్ అండ్ బి ఇన్ఫాస్ట్రక్షర్ మరియు ఇన్వెస్టుశాఖమంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, జిల్లా కలెక్టరు శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసి రాహుల్‌కుమార్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీనివాసులుతో పాటు పార్లమెంటు సభ ్యలు బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, డిఆర్వో పద్మజ, బక్రీద్ పండుగను ఎంతో భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలిపారు.

# మీ అవినీతి పై సీఎం,ఇరిగేషన్ మంత్రికి ఫిర్యాదు చేస్తా

**- జీడీపీ ఇరిగేషన్ అధికారులపై ఎమ్మెల్యే బీవీ అగ్రహం**



**గోనెగండ్ల జూన్ 16 ప్రభాతవార్త** మీ అవినీతి పై సీఎం,ఇరిగేషన్ మంత్రికి ఫిర్యాదు చేస్తా అంటు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జీడీపీ ఇరిగేషన్ అధికారులపై మండి పడ్డారు. అదివారం గాజులదిన్నె ప్రాజెక్టు ను ఆయన సందర్శించారు. ప్రాజెక్టు క్రస్‌గేట్లను, కట్ట ఎత్తును పెంచే పనులతో పాటు ఇతర పనులను కూడా ఆయన పరిశీలించారు. అధికారులు చేపట్టిన పనులపై బీవీ అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులతో కుమ్మకై పనులను అధికారులు సక్రమంగా చేయించలేదన్నారు. ఇష్టాను సారంగా టెండర్ పనులు, నిధులను రివైజ్ చేసుకుంటు పోయారని ఆయన అన్నారు. ప్రస్తుతం వర్షకాలం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు భారీ కురిసి ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరితే గేట్లు ఎత్తేందుకు కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కింద ఉన్న గ్రామాల కొట్టుకు పోవడం తప్ప మరో దారి లేదన్నారు. ఇది మరో అన్నమయ్య ప్రాజెక్టు అవుతుందన్నారు. అత్యవసర సమయంలో వర్షాలు కురిస్తే గేట్లు ఎతేందుకు కనీసం ఒక్క గేటునైనా మరో రెండు రోజులలోపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి వైసీపీ నాయకులకు తొత్తులుగా మారి అవినీతికి పాల్పడినారని, జరిగి అవినీతిపై మూడు రోజులలో సీఎం చంద్రబాబునాయుడికి, ఇరిగేషన్ మంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అవినీతికి పాల్పడిన అధికారులను వదిలేది లేదని ఆయన అన్నారు. ఎమ్మిగనూరుకు తాగునీరు జీడీపీ నుంచి అందిస్తామని ప్రకటించి కట్ట ఎత్తు పెంచుకొని ఒక టీఎంసీ నీటిని నిలువ చేసుకునేందుకు అనుమతులు తీసుకువచ్చారు. అయితే ఇప్పటి వరకు ఎందుకు ఎమ్మిగనూరు పట్టణంకు తాగునీటిని ఇవ్వలేదని ప్రశ్నించారు. హంద్రీనీవా నుంచి 3.5 టీఎంసీ నీటిని అలికేషన్ తీసుకువచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. తీసుకువచ్చిన నీటిని ఎందుకు వాడాలో తెలపాలన్నారు. ప్రాజెక్టు నుంచి డోన్, క్రిష్ణగిరి, కర్నూలు, గూడురు, కోడుమూరు, తదితర ప్రాంతాలకు తాగునీటి పథకాలకు మళ్లిస్తార న్నారు. కాంట్రాక్టర్‌తో అధికారుల కుమ్మకై టెండర్ నిధులను రివైజ్ చేసుకొని సోమ్ము చేసుకున్నారని అక్రమంగా తిన్న సోమ్మును కక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీపీ ఇరిగేషన్ ఈఈ శైలేశ్వరరెడ్డి, డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, పరమేష్, ఉగ్రనరసింహులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మద్దిలేటిస్వామి కోనేరులో వ్యక్తి మృతి



**బేతంచెర్ల, జూన్ 16, ప్రభాతవార్తః** మండల పరిదిలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహా స్వామి ఆలయ కోనేరులో కురువ మహేష్ (34) అనే వ్యక్తి మృతిచెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం గద్వాల మండలం వడ్డెపల్లికి చెందిన మహేష్ స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం ఆలయానికి రావడం జరిగింది. ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతిచెందారు. ఆదివారం కోనేరులో వ్యక్తి మృతదేహాం వుందని సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీయడం జరిగింది. మృతునికి భార్య స్రవంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.